ధాత ఉగాది కథల పోటీలో బహుమతి పొందిన కథ

# సత్యవతి సంస్కారం

- డా॥ గాయత్రీదేవి

కొస్త తీరిగ్గా ఉంది కదాని, ఆదివారం పొద్దున్నే పేపర్ చదవడం మొదలుపెట్టాను. మొదటిపేజీ నిండా పోలీసులో, సైనికులో, తీవ్రవాదులో- చేసిన కాల్పులు, మరణాలు.. ఏమిటో ఈ లోకం - మనిషిని మనిషి ఎందుకిలా చంపుకుంటున్నాడో.. ఎందుకీ హింసాప్రవృత్తి కొందరిలో కలుగుతుందో... అనుకుంటూ పేజీ తిప్పాను. అక్కడ మరోరకం బాధలు, హింసలు-

భార్య మీద అనుమానంతో ఆమెని చంపిన భర్త, కట్నం చాలలేదని కోడల్ని కాల్చేసిన అత్తగారు...

ఇవేనా వార్తలు... ఇటువంటి విషయాలు ప్రచురించడం వలన సంఘానికేమయినా ప్రయోజనం ఉంటుందా? ఏదో ఒక సంచలనాత్మక అంశం ఉంటేనే పత్రికలకు సర్క్యులేషన్ బావుంటుందని ఎందుకను కుంటారో? పాఠకులూ అంతే - ఇటువంటి వార్తల్నే చదువుకుని ఆనందిస్తారు. బహుశః అటువంటివి చదివినపుడు మనం అలా హింసించడం లేదు కాబట్టి మనం మంచి వాళ్ళం అనిపిస్తుందేమో....

అదేమో కానీ, ఇటువంటి వార్తలు చదువుతుంటే పెళ్ళిళ్ళు చేయబోయే అత్తగార్లు బెదిరిపోతారేమో అనిపిస్తుంది నాకు. అసలే అత్తగార్లంటే ఒక అపప్రధ ఉంది- కోడళ్ళని సాధించుకు తింటారని. ఇటువంటి వార్తలు అటువంటి దుష్కీర్తిని పెంచడానికి మరింత తోడవుతాయి అనుకుంటాను నేను. ఏమో మరి.. నిజంగా ఎటువంటి ప్రభావం ఉంటుందో...

అత్తగార్లంటే నాకు సత్యవతమ్మగారు జ్ఞాపకం వచ్చారు...

నా చిన్నప్పట్నించీ ఆవిణ్ణి చూస్తున్నాను నేను. వాళ్ళిల్లు మా ఇంటిదగ్గరే. మా అమ్మకీ, ఆవిడకీ మంచి స్నేహం. దాదాపు రెండు దశాబ్దాలుగా ఒకేచోట ఉంటున్నామేమో - వాళ్ళ కుటుంబ విషయాలన్నీ అమ్మకీ, తద్వారా నాకూ బాగా తెలుసు. ఆవిడ స్వంత ఊరు విజయవాడకు దగ్గర్లో ఉన్న పల్లెటూరు. కూతుర్ని దూరానికి పంపడం ఇష్టం లేని తండ్రి ఊళ్ళో సంబంధమే ఖాయం చేసి, పెళ్ళి చేసాడుట. అప్పుడు ఆవిడకి 18 ఏళ్ళుట. పెళ్ళయిన ఏడాదికే ఓ కొడుక్కి తల్లయింది. ఆవిడ కాలేజీ చదువులు చదవకపోయినా, పుస్తకాలు, వార్తాపత్రికల ద్వారా మంచి లోకజ్ఞానం సంపాదించుకుంది. ఆ రోజుల్లోనే మొదటి బిడ్డకీ, రెండో బిడ్డకీ ఎడం ఉండాలంటూ, మరో రెండేళ్ళ వరకూ రెండో బిడ్డని కనకుండా జాగ్రత్త పడింది. మరో రెండు రోజుల్లో, రెండో బిడ్డని ప్రసవిస్తుందనగా, పొలానికి వెళ్ళిన ఆమె భర్త, పాముకాటు వల్ల అక్కడికక్కడే మరణించాడు.

అంతవరకూ సాఫీగా సాగిపోతున్న ఆమె జీవితంలో అప్పట్నుంచీ కష్టాలు ప్రారంభమయ్యాయి. అత్తవారింట్లో అందరూ ఆమె దురదృష్టజాతకం వల్లనే ఆమె భర్త మరణించాడని సాధించేవారు. పుట్టకముందే తండ్రిని మింగిన దౌర్భాగ్యుడు అంటూ ఆమె రెండో కొడుకుని దూరంగా ఉంచేవారు. రెండు, మూడేళ్ళ వరకూ ఆ బాధలన్నీ సహించిన సత్యవతమ్మగారు, వారందర్నీ వదిలేసి, పిల్లలిద్దరితో విజయవాడ వచ్చేశారు.

తండ్రిచాటు కూతురుగా, భర్తచాటు భార్యగా ఉండే సత్యవతమ్మగారు, తన బిడ్డల భవిష్యత్తు కోసం గుండె నిబ్బరంతో కష్టాలని ఎదుర్కొంటూ ఒంటరి పోరాటానికి సిద్ధపడ్డారు. పుట్టింటివారు పసుపుకుంకుంగా ఇచ్చిన పొలాన్ని అమ్మి ఆ డబ్బు బ్యాంకులో వేసుకుంది. వడ్డీ డబ్బుతో సంసారాన్ని లాగే ప్రయత్నం మొదలు పెట్టింది. టైపు నేర్చుకున్నారు. పెద్దబ్బాయికి ఐదు సంవత్సరాలు రావడంతో, అతన్ని స్కూల్లో జేర్పించింది. అదృష్ట వశాత్తూ ఆవిడకి టైపిస్టుగా ఉద్యోగం దొరికింది. మా అమ్మ రెండో పిల్లాణ్ణి తన దగ్గర వదిలి వెళ్ళమంది ఉద్యోగానికి. అప్పడే మా అమ్మ ఆవిడకి బాగా దగ్గరయ్యింది. నేనూ చిన్నపిల్లనే కావడంతో స్కూలు లేని టైంలో ఆ పిల్లాడితో ఆడుకుంటూ ఉండేదాన్ని.

ఉద్యోగం రావడం వల్ల ఆర్థికంగా ఆవిడ పరిస్థితి మెరుగయ్యింది. కానీ, మగ తోడు లేకుండా ఒంటరిగా ఉంటున్న ఆవిడ ఆఫీసులోనూ, ఇంటి దగ్గరా బుద్ధిహీనులైన కొందరు మగవాళ్ళ వల్ల ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చేది - ఈ మాటలు అమ్మ నాన్నతో చెపుతుండేది. ఆ రోజుల్లో ఆ మాటలు నాకు అర్థం కాలేదు కానీ ఇప్పుడు తెలుస్తోంది, ఆవిడ అప్పుడు పడ్డ కష్టాలేమిటో. ఆ మనిషికి మనోధైర్యం ఎక్కువ కనుక అవన్నీ ఎంతో ధైర్యంగా ఎదుర్కోగలిగింది.

తను ఇన్ని కష్టాలు పడుతున్నా, పిల్లలు కష్టపడితే ఆవిడ తట్టుకోగలిగేది కాదు. ఎదుగుతున్న పిల్లలు 'అమ్మా అందరికీ అమ్మా నాన్న అని ఇద్దరున్నారు, మాకెందుకు నాన్న లేరు'' అని ఆవిణ్ణి ప్రశ్నించేవారు. స్కూల్లో ఫంక్షన్‌కి తల్లిదండ్రులిద్దరితో పిల్లలంతా ఆనందంగా వెళ్తూంటే, చిన్నబుచ్చుకున్న తన పిల్లల మొహాలు చూస్తే ఆవిడకి దుఃఖం ఆగేది కాదు. కొందరు పిల్లలు 'మీకు నాన్న లేడు. చచ్చిపోయాడు' అంటూ తన పిల్లల్ని తన కళ్ళెదురుగానే గేలి చేస్తుంటే, ఏడుస్తున్న తన పిల్లల్ని ఇంటి లోపలికి తీసుకెళ్ళి, తన దుఃఖాన్ని దిగమింగి, ఏవో ఆటలు ఆడి, కథలు చెప్పి పిల్లల్ని మరిపించేది.

ఆవిడ కొడుకులిద్దరూ కాలేజీ చదువులకి వచ్చే నాటికి తమకి తండ్రి లేకపోవడం, తమని పెంచడానికి ఒంటరిగా తల్లి పడుతున్న కష్టాలు అర్థమయ్యాయి. ఆ పైన వారిద్దరూ తల్లిని ప్రత్యక్షదైవంగా చూసుకునేవారు. వాళ్ళ చదువులు పూర్తయ్యాయి.ఇద్దరూ మంచి ఉద్యోగాలలో చేరారు. ఇన్నేళ్ళుగా ఆవిడ పడ్డ కష్టాలింక దూరమయ్యాయి అనుకున్నాం మేమంతా.

కానీ అలా జరగలేదు. అలాగే జరిగి ఉంటే ఈ పూట నేను ఆమెని తల్చుకునే దాన్ని కాదేమో.

తీరని కష్టం వచ్చింది ఆవిడకి. ఏ తల్లీ తట్టుకోలేని పుత్రశోకం పెట్టాడు భగవంతుడు ఆవిడకి. పెద్ద కొడుక్కి ఉద్యోగం వచ్చాక బీదకుటుంబంలో పిల్ల కవితని, కానీ కట్నం తీసుకోకుండా తీసుకొచ్చాడు. బాహ్యసౌందర్యమే కాదు, మరెంతో అంతః సౌందర్యం కల పిల్ల కవిత అని, ఆ అమ్మాయితో పరిచయమైన నాలుగు రోజులకే అనిపించింది నాకు. కల్లా కపటం తెలియని అమ్మాయి. చాలా నిదానస్తురాలు.

పెళ్ళయిన నాలుగు నెలలకే కవితకి నెల తప్పింది. అప్పటికే నేను స్వంత ప్రాక్టీసు పెట్టడం వల్ల, నేనే కవితని నెల నెలా పరీక్ష చేస్తూండేదాన్ని. కవితకి ఏడో నెల వచ్చింది. సూడిదలిచ్చి పుట్టింటికి తీసుకువెళ్తాం అన్నారు, కవిత తల్లిదండ్రులు. "సంప్రదాయం కోసం మీరు అమ్మాయిని పుట్టింటికి తీసుకువెళ్తాం అంటున్నారు - కానీ సరయిన వైద్య సౌకర్యం ప్రధానం కదా. ఇక్కడ మాకు బాగా తెలిసిన డాక్టరు చూస్తోంది. అమ్మాయి కాన్పు అయ్యేటపుడు తల్లి తన దగ్గరుండాలి అనుకొంటుంది. కనక మీరే ఇక్కడికొచ్చెయ్యండి'' అని సత్యవతమ్మ గారు ఆ బీద తల్లిదండ్రుల మీద ఖర్చుల భారం లేకుండా చేశారు.

తెలియని వారెవరైనా సత్యవతమ్మగార్ని, కోడల్ని చూస్తే తల్లీ కూతుళ్ళనే అనుకుంటారు. ఏడో నెలలో ఆవిడ కోడలికి శ్రీమంతం చేసింది. ఆ రోజు శ్రీమంతం జరుగుతున్నది తన కూతురికేనన్నట్లు ఎంతో ఆనందంగా గడిపారు ఆవిడ.

కాని ఆ రాత్రి వారి ఆనందాన్ని మింగేసింది.

ఊళ్ళో ఏదో అల్లర్లలో జరిగిన బాంబుపేలుడు సత్యవతమ్మగారి పెద్ద కొడుకుని బలి తీసుకుంది. ఎవరి కక్షలకి ఎవరు బలయ్యారో...? దేవుడు మంచివాళ్ళకి తప్పకుండా మంచే చేస్తాడంటారు. మరి ఈవిడకెందుకిలా కష్టాలు పెడుతున్నాడు అనుకునేదాన్ని.

అయినవాళ్ళు, కానివాళ్ళు అందరూ కవితది దురదృష్ట జాతకం అని నానా మాటలూ అన్నారు.

"కడుపులో బిడ్డ భూమ్మీద పడకుండానే ఇంత అరిష్టం జరిగింది, తరువాత ఇంకెంతమందిని బలి తీసుకుంటుందో" అన్నారు.

వివాహమై ఇంకా ఏడాదయినా కాకుండానే తన సర్వస్వం పోగొట్టుకున్నానని ఓ పక్క దుఃఖంలో మునిగి ఉన్న కవితకి ఈ మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి. ఆవేశం పట్టలేక, రెండు చేతుల్తోనూ తన కడుపు మీద దబదబా బాదుకోబోయింది. ఒక్కసారిగా కవిత చేతుల్ని తన చేతుల్తో బలంగా పట్టుకున్నారు సత్యవతమ్మగారు.

"చూడు కవితా, ఒక పక్క భగవంతుడు నా కొడుకుని తీసుకుపోయాడని ఏడుస్తూంటే, ఆ పరమాత్ముడు నీకిచ్చిన వరం, నీకు పుట్టబోయే బిడ్డని, ఎవర్తో ఏదో అన్నారని చంపుకుంటావామ్మా మనం రాక్షసులం కాకూడదమ్మా నీ బాధ నాకు తెలుసు. నేనుండగా నీకెందుకు బెంగ" అంటూ తన బాధని వదిలి, కోడల్ని ఓదార్చింది ఆవిడ. ఎవరే మాట మాట్లాడితే కవిత మనసు కష్టపెట్టుకుంటుందోనని ఆ క్షణం నుండి, నలుగుర్లోనూ ఆ అమ్మాయిని ఒంటరిగా వదల్లేదు సత్యవతమ్మగారు.

ఈ సంఘటన జరిగిన పదిహేను రోజుల తరువాత ఒకరోజు అమ్మ సత్యవతమ్మగారింటికి వెళ్తూంటే నేను కూడా వెళ్ళాను. కొంచెం సేపు కవితతో మాట్లాడితే ఆ అమ్మాయికి మార్పుగా ఉంటుందని.

కళకళలాడుతూండే కవిత మొహం కాంతిహీనంగా ఉంది. శూన్యంలోకి చూస్తూ, దీర్ఘ ఆలోచనలో ఉన్న ఆమె దగ్గరికి వెళ్ళి కూర్చున్నాను. నా చేతిలో చెయ్యి వేసుకుని మాట్లాడకుండా కన్నీరు కారుస్తూ కూర్చుంది కవిత. నేను కూడా ఆ పరిస్థితిలో ఏమీ మాట్లాడలేక పోయాను.

సత్యవతమ్మగారే అమ్మతో మాట్లాడారు ఆ రోజు.

ఆవిడ ఆ రోజు మాట్లాడిన మాటల్లో ఎక్కడా ఒక్కమాట కూడా పోయిన ఆవిడ కొడుకు గురించి లేదు.

పురాణేతిహాసాల గురించి మాట్లాడారు. అమ్మకి కూడా భారత రామాయణాలంటే కేవలం ఆసక్తి మాత్రమే కాదు, ఆ పుస్తకాలని విశ్లేషణాత్మకంగా చదివింది. అందుకే సత్యవతమ్మగారికి ఆ కథలో ఏమయినా సందేహాలుంటే అమ్మని అడుగుతుండేవారు. ఆ పూట కూడా ఆవిడ అమ్మని సందేహాలు అడుగుతూ, తన అభిప్రాయాలు చెపుతూ కూర్చున్నారు.

అమ్మని ఆవిడ అక్కయ్యగారూ అని పిలుస్తారు.

"అక్కయ్యగారూ, భారతం ఆదిపర్వంలో సత్యవతి సంతానమే రాజ్యం ఏలాలి అని మాట పుచ్చుకునిమరీ శంతనుణ్ణి పెళ్ళాడింది."


"కానీ దైవం అనుకూలించలేదు. ఆవిడ కొడుకులిద్దరూ చిన్న వయసులోనే మరణించారు" అంది అమ్మ.

"వారసులు లేకపోతే వదిలెయ్యలేదు సత్యవతి. పిల్లలు పుట్టడానికి ఉన్న ధర్మమార్గాలన్నింటినీ ఆలోచించింది. వ్యాసుణ్ణి పిలిపించింది. దేవర న్యాయాన పిల్లల్ని కనమని చెప్పింది కోడళ్ళకి. మనం ఈ రోజు ఆలోచిస్తే ఇవన్నీ అదోలా అనిపిస్తాయి. "కానీ సృష్టికార్యక్రమానికి ప్రాధాన్యత ఇచ్చి, ఆ కార్యక్రామం కొనసాగటానికి అనుకూలంగా ఏర్పాటు చేసారు ఈ ధర్మశాస్త్రాన్ని"

"బిడ్డలు పుట్టక ముందే తండ్రి మరణిస్తే ఏం చెయ్యాలో ఆలోచించారు కదా, బిడ్డ పుట్టే సమయానికి తండ్రి మరణిస్తే ఏం చెయ్యాలో..." అంటూ ఏడుపు దిగమింగుకుంటూ మాట ఆపేశారావిడ.

"ఉన్నాయేమోనండీ, నేను చదవలేదు" అంది అమ్మ ఆవిడ మాటల్ని అర్థం చేసుకుని.

"ధృతరాష్ట్రుడూ, పాండురాజూ ఆ నాటి సమాజం



కారణంగానో, రాచబిడ్డలు కనకనో తండ్రి లేకపోయినా అవమానాలు పొందలేదేమో, బాధలు అనుభవించలేదేమో తెలియదు కానీ, తల్లీ తండ్రీ ఉంటేనే పిల్లలు మానసికంగా పరిపూర్ణంగా ఎదుగుతారు. నా పిల్లలు చిన్నప్పుడు ఎంత క్షోభ అనుభవించారో ...నాకే తెలుసు... మళ్ళీ నా కోడలికి పుట్టబోయే బిడ్డకీ..."


"విధిరాత... ఏం చేస్తాం చెప్పండి"

"ఆ విధిరాతని మార్చాలనుకుంటున్నానండీ.."

అమ్మ ఆవిడ వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"అవును అక్కయ్యగారూ, మా కవితకి మళ్ళీపెళ్ళి చేస్తాను. నేను పడ్డ కష్టాలు ఆ పిల్ల పడకూడదు. నా పిల్లల్లా నా మనవడో, మనవరాలో తండ్రి లేని బిడ్డల్లా ఉండకూడదు."

ఆవిడ మాటలకి అమ్మ ఆశ్చర్యంగా చూస్తూ, "మీ ఆలోచన మంచిదే. కానీ, భార్య పోతే, అతగాడు ఎంత పెద్దవాడైనా, ఎంత పెద్ద పిల్లలున్నా పిల్లనిచ్చి పెళ్ళి చేసేందుకు సిద్ధపడే లోకం మనది. ఏవరో కాదు, చనిపోయిన ఆ అమ్మాయి చెల్లెల్నే బావగారికిచ్చి పెళ్ళి చేయడానికైనా వెనుకాడని తల్లిదండ్రులున్న సమాజం మనది. కాని, ఆడపిల్లకి మొదటిసారి పెళ్ళి చేయడమే గగనం అయిపోయిన ఈ రోజుల్లో, రెండో పెళ్ళి చేసుకుందుకి, అదీ పిల్ల తల్లిని చేసుకుందుకి ఎవరు ముందుకొస్తారు. ఏ తల్లి తన కొడుక్కి అలా పెళ్ళి చెయ్యడానికి ఒప్పుకుంటుంది. సత్యవతి గారూ, నేను మిమ్మల్ని నిరాశపరచడంలేదు ఈ సమాజంలో ఆడ మగ పట్ల ఉన్న భేదభావం చెప్పడమే నా ఉద్దేశ్యం. నన్ను అపార్థం చేసుకోకండి".



"ఎదుటివాళ్ళు ఏం అంటారో, ఏం అనుకుంటారో అని ఆలోచిస్తూంటే ఏమీ సాధించలేం అక్కయ్యగారూ. మొదట్నుంచీ, నా మనసుకి ఏది సరయినది అని తోస్తే అదే చేస్తున్నాను. ఇప్పుడు నా ధ్యేయం ఒక్కటే. నా కోడలు నాలాగా, దాని బిడ్డ నా పిల్లల్లా కష్టాలు పడకూడదు. అందుకోసం నా ప్రయత్నం నేను చేస్తాను" అంది ఆవిడ ధృఢంగా.

"తనకు దొరకనిది, మరొకరికి, అందునా కోడళ్ళకి దొరికితే సహించలేని' లక్షణమే, అత్తగార్లు కోడళ్ళని ఆరళ్ళు పెట్టడానికి కారణం అంటారు, కానీ మీరు..." అంటూ అమ్మ సత్యవతమ్మగారి చేతులు పట్టుకుని, కంఠం ఆనందంతో రుద్ధం కావడంతో మాట్లాడలేక పోయింది.

"అలా అనకండి.. మన పిల్లలు మనలా కష్టపడకూడదనీ, మనం పొందలేక పోయిన సుఖాలు, మన పిల్లలు సాధించుకోగలగాలనీ కోరుకోవడం కన్నవారి లక్షణం కాదంటారా... కవితని నేను కనకపోయినా, నా కన్నపిల్లే అనుకున్నాను. ఆ పిల్లకి నాలా మొండితనం, ధైర్యం లేవు. ఒకవేళ ఉంటే మాత్రం ఆ పిల్ల నేనుండగా, నాలా కష్టపడవలసిన అవసరం ఏంటి? అది అనుభవించవలసిన జీవితమే ఎక్కువవుంది, గడచిన దానికన్నా. నేనెంత కాలం ఉంటాను.. తోడుగా..? అదీ కాక ఎవరో తోడుగా ఉండడం, భార్యాభర్తలు ఒకరికొకరుగా ఉండడం ఒకటెలా అవుతుంది. ఆ బంధం సృష్టిలో ఎంతో మధురమైనది..." అంటూ ఆవిడ ఏదో లోకంలో ఉన్నట్లు మాట్లాడుతూ ఉన్నారు.

"మీరు వయసులో నా కన్నా చిన్నవారే అయినా ఆలోచనల్లో నా కంటే చాలా పెద్దవారు. మీకు సలహా చెప్పగలిగే దాన్ని కాదు కానీ, మంచి మనసున్న అబ్బాయిని వెతికి చెయ్యండి. తొందరపడితే, కోరి కష్టాలు తెచ్చుకున్నట్లు అవుతుంది.. మనకు తెలిసినంత వరకూ మనం సరిగ్గా చేస్తే ఆ పైన భగవంతుడున్నాడు..." అంటూ అమ్మ బయలుదేరింది. అమ్మతో పాటు నేనూ వచ్చేశాను.

* * *

ఇటువంటి అత్తగార్ల గురించి పేపర్లలో రాస్తే పది మందికీ ఆదర్శంగ్గా ఉంటుంది. మార్గదర్శకంగా ఉంటుంది. పాజిటివ్ విషయాలే ప్రగతికి ముఖ్యం అనుకుంటూ కుర్చీలో కళ్ళుమూసుకుని ఆలోచిస్తూ కూర్చున్న నేను, "అమ్మాయ్, నర్సింగ్ హోం నుంచి ఫోన్ వచ్చింది. కవితకి నొప్పులు ఎక్కువయ్యాయిట" అన్న మాటలతో వర్తమానంలోకి వచ్చాను. వెంటనే నర్సింగ్‌హోంకి వెళ్ళి పోయాను.

మొదటి కాన్పే అయినా మరీ కష్టపడ లేదు కవిత. ఆడ పిల్ల పుట్టింది. సత్యవతమ్మగారు, "ఇన్నాళ్ళకి మా ఇంట్లో మహాలక్ష్మిలా ఆడపిల్ల పుట్టింది," అంటూ ఆనందిం చింది.

ఆ రోజు సాయంత్రం పాప బర్త్ సర్టిఫికెట్ కోసం పంపే అప్లి కేషన్లో, పాప తల్లిదండ్రుల పేర్లు రాసి ఇమ్మని కాయితం సత్యవత మ్మగారికి ఇచ్చాను. ఆవిడ పేర్లు రాసినా చేతికి ఇచ్చింది. యధా లాపంగా తండ్రి పేరు చూసిన నేను షాక్ అయ్యాను. అది పాపని కన్న తండ్రి పేరు కాదు.

ఆవిడ నాలోని ఆశ్చర్యాన్ని చూసి, "అవునమ్మా ఇక మీదట పాప తండ్రి పేరు ఇదే" అంది.

"మరి కవిత ... ఒప్పు కుందా..."

"ఇద్దర్నీ ఒప్పించే చేశాను.. కవిత రూంలోకి వెళ్దాం, ఒకసారి వస్తావా?" అంటూ సత్యవతమ్మ గారు నా చెయ్యి పట్టుకుని తీసి కెళ్ళారు.

ఆ గదిలో బల్లమీద రెండు పూలదండలున్నాయి.

అప్పటికే అమ్మ కూడావచ్చి ఉంది.

ఆ రెండు దండలూ కవితా, అతనూ మార్చుకున్నారు.

"నా మనవరాలు మహాలక్ష్మిలా పుట్టిన వేళే, నా కోడలు మళ్ళీ లక్ష్మీదేవిలా తిరి గేందుకు మంచి ముహూర్తం అనుకున్నాను. మీరన్నట్లుగానే మంచి వాడని, నాకు పూర్తిగా నమ్మకం ఉన్న అబ్బాయితోనే కవిత పెళ్ళి చేశాను అక్కయ్య గారూ" అన్నారావిడ అమ్మతో.

పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ ఆవిడ కాళ్ళకి నమస్కరించారు.

సత్యవతమ్మగారు, చంటి పిల్లని తీసుకొచ్చి, అతని చేతిలో పెట్టి "కవితనీ, ఈ చంటిపిల్లనీ నీ చేతుల్లో పెడుతున్నా౹ా. నా చేతుల్లో పెరిగి, కష్టం, సుఖం తెలిసిన నువ్వే కవితకి సరైన వరు డివి. ఇక మీదట నీకు తోడబుట్టిన అన్న రక్తం పంచుకు పుట్టిన పిల్లకి నువ్వే తండ్రివి" అంది ఆవిడ.

కొడుకు పోవడానికి కోడలి దురదృష్ట జాతకమే కారణం అని తిట్టిపోసే వాళ్ళే ఉన్న ఈ లోకంలో ఆ కోడలికే తన చిన్న కొడుకునిచ్చి పెళ్ళి చేసి దీవించి, విప్లవాత్మకంగా, లోకానికి మార్గదర్శకురాలయిన అత్తగారు సత్యవతమ్మగారి సంస్కారానికి మనసులోనే .నమస్కరించి, కొత్త దంపతులని మనసారా అభినందించాను.❑